క్లుప్తంగా

కెపాసిటర్లు అమర్చుకోవాలి

కామేపల్లి: విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కొత్త లింగాల విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడి కాలిపోయే అవకాశం ఉందని, అందుకే మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.

విశ్వబ్రాహ్మణ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్ ఉప్పల్ బాగాయత్ విశ్వ బ్రాహ్మణ ఆత్మగౌరవ నిర్మాణ స్థలంలో నవంబర్ 5న జరిగే మహాజన సభ కరపత్రాలను ఆదివారం నగరంలోని గోల్డ్ కాంప్లెక్స్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండోటా సోమేశ్వరా చారి, కోశాధికారి వెగ్గళం వెంకటేశ్వర్లు, ప్రతినిధులు ఇనుగుర్తి వెంకటేశ్వర్లు, గౌరోజు వసంత్‌బాబు, నందిగామ వీరబ్రహ్మాచారి, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పిన్నోజు నగేశ్ చారి తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు చెక్కును అందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేస్తున్న సేవలు అమోఘమని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ అన్నారు. ఆదివారం నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బాసరలోని ట్రిపుల్ ఐటీ, సీబీఐటీ కళాశాల హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు సంవత్సరానికి చెల్లించాల్సిన మొత్తం రూ.1.15లక్షల ఫీజును అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. పీఆర్‌టీయూ నాయకుడు యలమద్ది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు, నాగేశ్వరరావు, కొంగర పురుషోత్తం, త్రిపురనేని జానకి బోస్, ఆళ్ల వెంకట్రావు, డాక్టర్ చావా సత్యప్రసాద్, తాతా రాఘవయ్య, వై.హరినాథ్‌బాబు, కాంపాటి చలపతిరావు, నరసింహారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తిరుమలాయపాలెం: మండలంలోని పోలింగ్ బూత్‌లను కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి మండల ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, భద్రత తదితర సమస్యలపై ఆరా తీశారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి పోలింగ్ స్టేషన్లలో సమస్యలను గుర్తించారు.

నేడు జీవాలకు టీకాలు..

కామేపల్లి: పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన సోమవారం నుంచి గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ గోపికృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవాల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కవి సమ్మేళనంలో 'గాజుల' విజేత

ఖమ్మంగాంధీచౌక్: యాదగిరి గుట్టలో కలం స్నేహం సంగీత, సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం పోటీల్లో నగరానికి చెందిన ఉపాధ్యాయురాలు గాజుల భారతి శ్రీనివాస్ విజేతగా నిలిచారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫిల్మ్ మేకర్, డైరెక్టర్ గోపాల్ ఆచార్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని, బహుమతిని భారతి శ్రీనివాస్ అందుకోగా పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

తెరుచుకున్న ఆలయాలు

ఖమ్మంగాంధీచౌక్: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం నుంచి మూసి ఉంచిన దేవాలయాలను సంప్రోక్షణం చేసి ఆదివారం ఉదయం తెరిచారు. ఆలయ అర్చకులు ఆదివారం ఉదయం దేవాలయాల ద్వారబంధాలను తెరిచి సంప్రదాయ పద్ధతుల్లో సంప్రోక్షణం, పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఏర్పాట్లు చేశారు. నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, శ్రీ భ్రమరాంబ శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం, కమాన్ బజార్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, నగరంలోని కాల్వొడ్డు, కమాన్ బజార్, కస్బాబజార్, చెరువు బజార్, ఎన్ఎస్‌పీ రోడ్, శ్రీనివాస్‌నగర్, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలను అర్చకులు తెరిచారు. భక్తులు యథాతథంగా ఆలయాలను దర్శించుకున్నారు.

ప్రతీ ఓటరుకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఐదేళ్లకోసారి వస్తుంది. అలాంటిది తొలిసారి ఓటు వేయాలని చూస్తున్న యువతకు ఆ కిక్కే వేరబ్బా. ఓటు వేశాక సిరా చుక్క ఉన్న వేలుని చూపిస్తూ సెల్ఫీ దిగి సోషల్‌మీడియాలో పెడితే వచ్చే లైక్‌లతో ఎవరెస్ట్ ఎక్కినంత సంబర పడతారు. కొత్తగా అప్లై చేసుకున్న యువ ఓటర్ల అభిప్రాయాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



రెడీ టు ఓటే..!

కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత

- తొలిసారి ఓటేసేందుకు సిద్ధపడిన పలువురు
- ఖమ్మంలో 19 ఏళ్ల లోపు 12,667 మంది
- పాలేరులో 9,066 మంది ఓటర్లు
- కీలకంగా మారనున్న యువత ఓట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గంలో కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్ల హవా కనిపిస్తోంది. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వెలవడనున్న తీర్పులో వీరి ఓటు కీలకం కానుంది. ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం 18 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ఓటర్లు ఖమ్మం నియోజకవర్గంలో 12,667, పాలేరులో 9,066 మంది ఉన్నారు. ఈ లెక్కన ఎన్నికల్లో పోటీ చేసే నేతల గెలుపు ఈ ఓటర్ల తీర్పుపైన ఆధారపడనుంది.

విస్తృత ప్రచారంతో..

కొత్త ఓటర్లు భారీ సంఖ్యలో నమోదవడం వెనుక ఎన్నికల సంఘం పాత్ర అంతా ఇంతా కాదు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈసీ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడం, నమోదైన వారంతా పోలింగ్‌లో పాల్గొనేలా చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా కళాశాలలో సెమినార్లు, వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు ఇలా ఎన్నెన్నో కార్యక్రమాలను నిర్వహించింది. ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు కాలేజీలకు వెళ్లి అక్కడే ఓటర్ల నమోదు చేయడం, యువత తమ ఫోన్‌లలోనే ఓటు నమోదు చేసుకునేలా ఆన్‌లైన్‌లో నమోదు వంటి వినూత్న చర్యలు చేపట్టింది. దీంతో పెద్ద సంఖ్యలో యువత తమ ఓట్లను నమోదు చేసుకున్నారు.

ఓటు వేసేందుకు ఆసక్తిగా..

శాసనసభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు యువ ఓటర్లు ఉవ్విళ్లురుతున్నారు. తొలిసారి ఓటు హక్కును వినియోగించుకుని, తమ నాయకుడిని ఎన్నుకోవాలనే కలకంటున్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న 18–19 ఏళ్ల యువత తొలిసారే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 30న జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ఓటు ఎప్పుడు వేయాలా అని యువ ఓటర్లు జోష్‌లో ఉన్నారు.

ఓటు వేయాలని ఉంది..



తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? ఓటు ఎప్పుడు వేయాలా అని ఉత్సాహంగా ఉన్నాను. గత నెలలోనే నేను ఓటరుగా నమోదు చేసుకున్నా. మా ప్రాంత ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడంలో నేనూ భాగస్వామిని అవుతున్నందుకు సంతోషంగా ఉంది.

– ప్రొద్దుటూరి సిరిచందన, యువ ఓటర్, ఖమ్మం

ప్రజాస్వామ్య రక్షణకు తొలిమెట్టు కావాలి..



18 ఏళ్లు నిండడంతో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు ఓటు హక్కు వచ్చింది. 18 ఏళ్ల వయస్సులో వేసే ఓటు ప్రజాస్వామ్య రక్షణకు తొలిమెట్టుగా.. ప్రభుత్వ నిర్మాణానికి ఇది మలిమెట్టుగా ఉండాలనేది నా కోరిక. డబ్బులు, ప్రలోభాలకు ఓటును తాకట్టు పెట్టకుండా ఓటు వేస్తాను.

– కంకణాల శరత్ చంద్ర, యువ ఓటర్, ఖమ్మం

మొదటిసారి ఓటేయబోతున్నా..



మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా. ఓటు హక్కు వచ్చినందుకు సంతోషంగా ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కచ్చితంగా నమోదు చేయించుకోవాలి. దీనివల్ల యువతరం ఆలోచనలకు తగినట్లుగా ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు వీలుంటుంది.

– పి.అఖిల్‌చంద్ర, యువ ఓటర్, ఖమ్మం

నియోజకవర్గాల వారీగా యువ ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	18–19 ఏళ్లలోపు	పురుషులు	స్త్రీలు
ఖమ్మం	12,667	6,597	6,070
పాలేరు	9,066	4,996	4,070

ఓటు.. పవర్‌ఫుల్ వెపన్



మన జీవితాన్ని మనమే మార్చుకునే గొప్ప అవకాశం నాకు మొదటిసారిగా వచ్చింది. ఓటు హక్కు అనేది ఐదేళ్లకోసారి దొరికే ఒక పవర్‌ఫుల్ వెపన్. దీన్ని సక్రమంగా వినియోగిస్తే ప్రజల భవిష్యత్, వారి తలరాతలను చక్కటి మార్గంలో పెట్టే ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చు. నేను తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల గర్వంగా ఉంది.

– షేక్ ఉమర్, యువ ఓటర్, ఖమ్మం

నా ఓటు కీలకంగా ఉండాలి..



మొదటిసారి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నాను. విద్య, వైద్యానికి మేలు చేకూర్చే విధంగా, అభివృద్ధి చేసేటువంటి నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో నా ఓటు కీలకంగా ఉండాలని కోరుకుంటున్నాను. సమాజాన్ని మార్చడంలో యువత కీలక పాత్ర పోషిస్తుంది. యువత చదవడమే కాకుండా ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

– ఎన్.ప్రియాంక, యువ ఓటర్, ఖమ్మం

ప్రలోభాలకు లొంగకూడదు..



ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఒక్కసారి డబ్బులు తీసుకుని ఓటు వేస్తే రాబోయే ఐదేళ్లు బానిసలుగా బతాల్సిన వస్తుంది. డబ్బులు, బహుమతులు తీసుకోకుండా ఓటు వేయాలనేది నా కోరిక. అప్పుడే మనకు కావాల్సిన సమస్యలపై ప్రశ్నించవచ్చు. యువ ఓటర్లంతా మేల్కొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలి.

– గొలుసు విజయ్, యువ ఓటర్, ఖమ్మం

ఖమ్మం అభివృద్ధి బాధ్యత నాదే..

ఆత్మీయ సమ్మేళనాల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంఅర్బన్: గ్రానైట్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ ఖమ్మంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, నన్ను గెలిపిస్తే మరింత అభివృద్ధికి పాటుపడతానని ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ క్లబ్, చర్చి కాంపౌండ్ సీఎస్ఐ సెయింట్ మేరీస్ చర్చిలో, 4, 17, 18, 26, 27, 31, 35, 58వ డివిజన్లు, మామిళ్ళగూడెం, ఓ అపార్ట్‌మెంట్ గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తేనే అన్ని రంగాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా రుణం తీర్చుకోవాలని, ఆరు గ్యారంటీ పథకాలను అందుకోవడం కోసం సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావిద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, శేఖర్‌గౌడ్, కరమర్తపు మురళీ, పలువురు గ్రానైట్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాకే ఓట్లడుగుతా..

పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మంరూరల్: సత్యనారాయణపురం సభలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: ఒక్కసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ఓటేసి ఆశీర్వదించిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాకే మళ్లీ మీ వద్దకు వస్తానని కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కరుణగిరి, నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీలో, మున్నేటి వరద ముంపు గురించి ప్రజలు పొంగులేటి దృష్టికి తీసుకురాగా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జనవరిలో ఆర్‌సీసీ వాల్ నిర్మిస్తామని తెలిపారు. నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, తదితర సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక పాస్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సమ్మేళనంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందిరమ్మ కాలనీ, సత్యనారాయణపురం, నాయుడుపేట, పెదతండాల్లో ఆదివారం రాత్రి పొంగులేటి పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మెనిఫెస్టోలో తెలిపిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్..

కూసుమంచి: మండలంలోని హీరామాన్‌తండా సర్పంచ్ మూడ్ కోట్యాతో పాటు వార్డు సభ్యులు రవి, బుజ్జి, శ్రీను మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు ఆధ్వర్యాన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారు పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే లాల్‌సింగ్ తండాకు చెందిన వార్డు సభ్యులు దరావత్ హచ్చా, గుగులోత్ వసంత పొంగులేటి ప్రసాదరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా ఆయన వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భూక్యా కృష్ణమూర్తి, గ్యామా, హత్యా, సురేశ్, శ్రీను, భాస్కర్, మల్సూర్, లాల్‌సింగ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొంగులేటి కుటుంబీకుల ప్రచారం..

నేలకొండపల్లి/కూసుమంచి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని ఆయన తనయుడు హర్షరెడ్డి నేలకొండపల్లి మండలం కోనాయిగూడెంలో, సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కూసుమంచి మండలం గోరీలపాడుతండాలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, నాయకులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేశ్, వెన్నపూసల సీతారాములు, కొడాలి గోవిందరావు, కుక్కల హనుమంతరావు, జొన్నలగడ్డ రవికుమార్, సుదాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాసూనాయక్, బాబు నాయక్, మంచ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీకు అండగా ఉన్న వారినే గెలిపించండి..

పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి



కూసుమంచి: అగ్రహారం ప్రచార సభలో మాట్లాడుతున్న కందాళ

కూసుమంచి/తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: మీకు గత ఐదేళ్లుగా అండగా నిలిచి ఆపదలో ఆదుకున్న వారినే గెలిపించాలని పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కూసుమంచి మండలంలోని మునిగేపల్లి నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించాక ప్రచారాన్ని కొనసాగించారు. ప్రచారానికి ముందు తన స్వగ్రామం రాజుపేటలో తన తల్లిదండ్రులు నర్సింహారెడ్డి, మోహినమ్మ, సోదరుడు జితేందర్‌రెడ్డికి నివాళులు అర్పించారు. ఖమ్మంరూరల్ మండలంలోని రెడ్డిపల్లిలో గల మారెమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూసుమంచి మండలంలో ప్రచార నిమిత్తం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రచార సభల్లో కందాళ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందని, తిరిగి మరోమారు ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని రాజారం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు 3, 27వ డివిజన్లకు చెందిన పలువురు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నగరంలోని 27వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు వల్లూరి తిరుపతిరావుతో పాటు పలువురు నాయకులు మదూరి పూర్ణచందర్‌రావు ఆధ్వర్యాన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, వంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, సింగు శ్రీనివాస్, మండదపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 3వ డివిజన్ పరిధిలో డివిజన్ ఇన్‌చార్జ్ కొనకంచి వరప్రసాద్ ఆధ్వర్యాన యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరగా.. సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, పార్టీ నాయకుడు పువ్వాడ నరేన్‌రాజ్ తదితరులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నర్సయ్య, నాగరాజు, రాంబాబు, రామకృష్ణ, వీరభద్రం, వెంకటేశ్వర్లు, సతీశ్, వెంకట్రావు, నరేందర్, అజయ్, వినయ్, గోపి, సాయి, వీరబాబు, కిశోర్, భాస్కర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ అధ్యక్షుడు కాట్రాల శ్రీరాములు, కార్యదర్శి ఆకుల వెంకటేశ్వర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు పురం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శీలం పాపారావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శీలం పాపారావు అన్నారు. తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే బీసీ సామాజిక వర్గాలకు చెందిన నాయకుడిని ముఖ్య మంత్రిని చేస్తామని ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలు ఇచ్చిన హామీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ఖమ్మంలో మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీసీలను ఇతర పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని అన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే అభ్యర్థులకు సీట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలలో ఎవరినైనా అభ్యర్థిగా ప్రకటిస్తే అందరం ఒకే కుటుంబంగా కలిసికట్టుగా ఉండి గెలిపించుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు అల్లిక అంజయ్య, జ్వాలా నర్సింహారావు, దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్ర ప్రదీప్, మంద సరస్వతి, దొడ్డా అరుణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, పుల్లయ్య, మార్తి వీరభద్రప్రసాద్, వీరూ గౌడ్, భద్రం, పాపారావు, శ్రీదేవి, సుగుణ, మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలకు తరలిన యువత

ఖమ్మంరాపర్తినగర్: శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జరుగుతున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభలకు ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి పెద్దసంఖ్యలో యువత తరలివెళ్లారు. బస్సుల ద్వారా మహాసభలకు వెళ్తున్న వారికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, ఏఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువత పట్ల నిర్లక్ష్యం వహించాయని, నిరుద్యోగులను విస్మరించిన పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. మహాసభలకు వెళ్లిన వారిలో ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గణపారపు ఉపేందర్, పాలేరు నియోజకవర్గ కార్యదర్శి రెబ్బగౌడ్ల గోపి, జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, బొడ్డు యాకయ్య, అబ్బూరి మహేష్, గణేష్, సుకుమార్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీతోనే సామాజిక వర్గాల అభివృద్ధి..



బీఎస్పీ మేనిఫెస్టోను వివరిస్తున్న ప్రతాప్

కామేపల్లి: బీఎస్పీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లగూడెం, పింజరమడుగు, పాతలింగాల, కొత్తలింగాల, ముచ్చర్ల, మద్దులపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకూ బీఎస్పీ ప్రగతి భవన్‌కు ఆర్ఎస్‌పీ అనే నినాదంతో ఇంటింటికి తిరిగి ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అదే విధంగా బీఎస్పీ మేనిఫెస్టోను బహుజన సిద్ధాంతాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిప్పలపల్లి శ్రీనివాసరావు, ఆనంద్‌రావు, ధరావత్ శ్రీకాంత్, శేఖర్, మంగీలాల్, కిషన్, నాగేశ్వరరావు, వెంకన్న, రాజేశ్, లోకేశ్, కిరణ్, సాయి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ముస్లింలకు న్యాయం

నేలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే ముస్లింలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ ముస్లిం కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాజామియా అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసరెడ్డి గెలుపునకు ముస్లింలు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కేసీఆర్ దోపిడీకి ఇక చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుభాన్, మధార్, అహ్మద్, నజీమ్ బేగం, ఖయింబాబు, ఇమ్రాన్, నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిక

ఖమ్మంరాపర్తినగర్: జనసేన పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు మేడబోయిన కార్తీక్ సమక్షంలో ఆదివారం 27, 34వ డివిజన్లకు చెందిన తోటా కిరణ్, పొన్నం నరసింహారావు జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి కార్తీక్ సాదరంగా ఆహ్వానించారు. ఎన్నో ఏళ్లుగా సంప్రదాయ పార్టీలలో ఉండి జెండాలు మోసి విసిగి పోయి అట్టడుగు వర్గాలకు వేదికగా ఉన్న జనసేన పార్టీని నమ్మి ఈ పార్టీలో చేరుతున్నామని చేరినవారు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు లయ ఉపేందర్, మండల అధ్యక్షుడు సచ్చు స్రవంత్ కన్నా, నగర కార్యదర్శి ఫయాజ్, వెంకట్, నగేశ్, నరేశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా..

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ మహ్మద్ అశ్రీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత కాలం సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్..

ఖమ్మంలీగల్: కాంగ్రెస్ పార్టీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు న్యాయవాది తాళ్లూరి దిలీప్ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఏనాడు స్పందించలేదని, న్యాయవాదులకు మంచి చేస్తున్నందుకే తాను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.న్యాయవాద రక్షణ చట్టం, నోటరీల నియామకంపై ఎంపీ నామాకు చెప్పగానే పార్లమెంట్‌లో గళం విప్పారన్నారు. అడిగిన వెంటనే 2019 తర్వాత నమోదైన న్యాయవాదులు ఆరోగ్య బీమా కార్డులు అప్లై చేసుకోవడానికి మంత్రి పువ్వాడ ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిరావాలి

కామేపల్లి: నవంబర్ 1వ తేదీన ఇల్లెందులో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలం నుంచి సుమారు 15 వేల మందిని సభకు తరలించనున్నట్లు తెలిపారు.

గుర్తుండేలా ప్రచారాలు..



అంబాసిడర్ కారుతో ఎమ్మెల్యే కందాళ ప్రచారం



కారుపై ఏనుగు బొమ్మతో బీఎస్పీ ప్రచారం

కూసుమంచి: ఎన్నికల ప్రచారాలు వేడెక్కుతుండగా ఆయా పార్టీల అభ్యర్థులు తమ గుర్తులను ప్రజల మదిలో నాటుకుపోయేలా వినూత్నంగా ఆలోచనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తన ప్రచారంలో కారు గుర్తు గుర్తుండేలా ఏకంగా అంబాసిడర్ కార్లు తెప్పించి వాటికి గులాబీరంగు వేయించి ప్రచారంలో తిప్పుతున్నారు. దీంతో అవి ప్రచారాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అలాగే బీఎస్పీ అభ్యర్థి అల్లిక వెంకటేశ్వరరావు తన పార్టీ గుర్తు ఏనుగుతో ఓటర్లకు గుర్తుండేలా ఓ కారుపై ఏనుగు బొమ్మను బిగించి ప్రచారాల్లో తిప్పుతున్నారు. ఇలా అభ్యర్థులు గుర్తులు గుర్తుండేందుకు పలు విధాలుగా ప్రయత్నిస్తున్నారు.